# విచిత్ర వస్త్రము

వి. రంగస్వామి

*

రాజు మంచముపట్టాడు కానీ కండ్లు తీవ్రంగానే యున్నాయి. చెక్కిళ్లు యెఱ్ఱగానున్నాయి. తన సచివుల బిలపించి "వైద్యులను రప్పించండి" యని వుత్తరువుచేశాడు. రాజాజ్ఞ నెఱవేఱింది. వైద్యులు రాజనగరులోనే బసచేశారు. ఒకడు స్థూలకాయుఁడు. వైద్యశాస్త్ర మతనికి కరతలామలకము. రేయింబవళ్లు వైద్యమును పఠించుచుండేవాడు. మరో వైద్యుడు వైద్యశాస్త్రజ్ఞానశూన్యుడు. ఎముకలు కనుపరుస్తూండే దేహము. తనయెడ రోగనివారణార్థము వచ్చేవారివలన నతనికి కొంచెముకూడ యిబ్బందిలేదు. ఎందుకంటే, రోగము నివారణమైతే, వారి వారికి దోచినది యిచ్చేవారు. రోగి చనిపోయినయెడల, జ్ఞాతులు వైద్యునికి రెట్టింపు ద్రవ్యమిచ్చేవారు.

అంతఃపురమునకు దేబడ్డాడు స్థూలకాయ వైద్యశిఖామణి. రాజును పరీక్షించాడు. పాపమతడు యధార్థవాది. చూచి, "రాజుగారికి యే విధమైన వ్యాధియు నున్నట్లు గోచరంకాలేదు" అన్నాడు. తటాలున లేచి రాజు కోపావేశంతో "యితని కంఠము దెగనఱకండి" యని యఱిచాడు. పాపమా వైద్యుని గతి యట్లయ్యింది.

ఈ వార్త వినగానే రెండో వైద్యుని గుండె జల్లుమనింది. కానీ యేదో ధైర్యం కలిగించుకున్నాడు. రాజును పరీక్షించాడు. ఏదో యోచిస్తున్నట్లు నటించి "మహారాజా! ప్రస్తుత మొక గొప్ప జాడ్యము మిమ్ముల బాధించుచున్నది, దాని నేను తొలగింప గలుగుతాను. దయయుంచి దానికి కావలసియున్న వస్తువును మీరు తెప్పించాలి. అది యేమంటే, దేశంలో, నెప్పుడూ దుఃఖమనుభవింపనివాని పైవస్త్రమును దెప్పించండి. మఱల నేనా జాడ్యమును పోగొడతాను" అన్నాడు. రాజు సంతోషించాడు. వైద్యుణ్ని సమ్మానించాడు.

మంత్రులూ, భటులూ దేశమంతట తిరగడమారంభించారు వస్త్రాన్వేషణార్థము. పట్టణములు, పల్లెటూర్లు తిరిగారు, ఎటుచూచినం యొకింత కష్టము లేనివాడు వారికి గానరాలేదు. గొప్పగా డస్సిపోయారు. దినమూ రాజునకు యీ వార్తలు అందుచుండినాయి.

తుదకు పచ్చికతో నిండిన యొకపొలమువైపు పోతూంటే వారికొక వ్యక్తి యగపడ్డాడు. అతడు పాడుతూ యెగురుతూ, నవ్వుతూ వున్నాడు. వానివద్దకు వెళ్ళి "గొప్ప డబ్బులిస్తాము, నీ పై వస్త్ర మిస్తావోయి" యని యడిగారు. మరల నవ్వుతూ అతఁడు "బాబూ, కట్టేటందుకు గుడ్డ నా వద్ద లేదండీ" యన్నాడు. ఏం చేస్తారు మఱి.

అందఱు తిరిగారు. తమ ప్రయత్నాలన్ని నిష్ప్రయోజనము లయ్యిందను వార్తను రాజుకు దెలిపారు. రాజుకు పలు యోచనలు పుట్టాయి. దేశములో జనులు పడుతూండే కష్టము లతనికి దర్పణములోవలె కనబడ్డాయి కవాటాలు తెరిపించాడు. చల్లని గాలి సోకింది. తను చేసిన కార్యమున కవమానించుకొన్నాడు. గుఱ్ఱమెక్కి రాజ్యముఁ జూడ బయలుదేరాడు.